ఇఫ్తార్



భరత్‌నగర్‌లోని మసీదులో శనివారం రాత్రి మసీదు కమిటీ ఇఫ్తార్ నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఉపవాసంలో ముస్లింలకు ఖజూర్ తినిపించారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ సభ్యులు షేక్ మొహమ్మద్ మగ్బూల్, షేక్ ఖలీల్, ఎండీ షరీఫ్, సయ్యద్ మజార్, గౌస్, అల్తమాస్, కాంగ్రెస్ నాయకులు నాగిరెడ్డి, శేరి సతీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. – మూసాపేట

ఎన్నికల తనిఖీలు

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీలను ముమ్మరం చేశారు. ఆదివారం మలేసియా టౌన్‌షిప్ రెయిన్ ట్రీపార్కు వద్ద కేపీహెచ్‌బీ పోలీసులు ప్రత్యేక చెక్‌పోస్ట్ ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ శారు. కేపీహెచ్‌బీ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ... ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన సందర్భంగా పెద్ద మొత్తంలో నగదు తీసుకెళ్లేందుకు ఆ నగదుకు సంబంధించిన అనుమతి పత్రాలను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. అనుమతి పత్రాలు లేని నగదును సీజ్ చేస్తామని సూచించారు. – భాగ్యనగర్‌కాలనీ



మలేసియా టౌన్‌షిప్ రెయిన్ ట్రీపార్కు వద్ద వాహనాల తనిఖీలు

కుమ్మరి ఆత్మీయ సమ్మేళనం




మోతీనగర్‌లోని రాయల్ ఫంక్షన్‌హాల్‌లో జూబ్లీహిల్స్, కూకట్‌పల్లి నియోజకవర్గాల కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా 10వ వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ సబిహా బేగం హాజరై మాట్లాడారు. సమాజంలో వ్యాపారం, విద్య, రాజకీయం ఇలా అన్ని రంగాల్లో కుమ్మర్లు అభివృద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంటీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, ప్రజాపతి, లింగాల ఐలయ్య, వెంకటప్పన్న, నార్లపురం మల్లేష్, కోట లింగం, నార్లపురం నాగరాజు, రోశయ్య తదితరులు పాల్గొన్నారు. – మోతీనగర్

గృహజ్యోతికి అర్హులమా.. కాదా?

గృహజ్యోతి పథకంతో పేదల ఇళ్లల్లో వెలుగులు నిండనున్నాయని ఎదురు చూసిన ప్రజలకు నిరాశే ఎదురయ్యింది. ప్రజాపాలనలో గంటల తరబడి క్యూలలో నుంచొని దరఖాస్తు చేసుకున్నప్పటికీ అన్ని అర్హతలు ఉన్నా ఇప్పటికి చాలా మందికి గృహజ్యోతి పథకం అందలేదు. జీరో బిల్లు వస్తుందని ఎదురు చూస్తున్న ప్రజలకు రాకపోవటంతో ఎటు వెళ్లాలో... ఎవరిని కలవాలో... ఎందుకు రాలేదో... వస్తుందో.. రాదో అనే సందిగ్ధంలో ప్రజలు ఉన్నారు. చాలా మందికి జీరో బిల్లు రాకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాపాలనకు సంబంధించిన ఒక వెబ్‌సైట్ అందుబాటులోకి తీసుకొస్తే అందులో ప్రజాపాలన దరఖాస్తు నంబర్ ఎంటర్ చేస్తే అర్హులమా? కాదా? అని ప్రజలు తెలుసుకునే వీలు ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

- చాలా మందికి జీరో బిల్లు రాకపోవడంపై సర్వత్రా విమర్శలు
- మళ్లీ ఎవరికి దరఖాస్తు చేసుకోవాలి.? అర్హులమా.. కాదా అని తెలుసుకునేదెట్లా?
- ఈ గందరగోళంపై ఉన్నతాధికారులు స్పందించాలని ప్రజల డిమాండ్
- ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేశామంటున్న అధికారులు



మూసాపేట: ఒక్కో డివిజన్‌లో దరఖాస్తు చేసుకున్న వారిలో సగం కన్నా ఎక్కువ మందికి గృహజ్యోతి పథకం అందటం లేదు. ఎన్నో కారణాలతో వాటిని తిరస్కరించారు. ఈ పథకానికి తిరస్కరించబడిన వారి కోసం ప్రత్యేక సెంటర్‌లు ఏర్పాటు చేసి వారికి కూడా ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటున్నారు. కానీ చాలా మందికి సెంటర్ ఎక్కడ ఉందో కూడా తెలియదు. ఎలాంటి ప్రచారం లేకపోవటంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

సగానికి పైగా దరఖాస్తులు తిరస్కరణ

మూసాపేట డివిజన్‌తో పాటు పలు డివిజన్‌లలో కూడా సగానికి పైగా ప్రజలకు గృహజ్యోతి పథకం అందలేదు. వివిధ కారణాలతో దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. దరఖాస్తు ఫారంలో ఎలక్ట్రికల్ యూఎస్సీ నంబర్ తప్పుగా రాయడం... ఇంటి యజమాని పేరుపై ఉన్న ఒకే కరెంటు బిల్లును అద్దెకున్న పలువురు దరఖాస్తు చేసుకోవటంతో తిరస్కరణకు గురయ్యాయి.

ప్రతి డివిజన్‌లో ప్రత్యేక సెంటర్ ఏర్పాటు చేశాం: అధికారులు

అదే నంబర్‌ను అందరూ రాయటం, రేషన్‌కార్డు లేకపోవటంతో, ఆన్‌లైన్‌లో నమోదు చేసేటప్పుడు తప్పుగా ఎంట్రీ చేయటం ఇటువంటి పలు కారణాలతో దరఖాస్తు తిరస్కరణకు గురయ్యాయి. అయితే యూఎస్సీ నంబర్ సరిచేయటానికి.. ఇంటి యజమాని పేరుపై ఉన్న కరెంటు బిల్లు వంటి పలు సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి డివిజన్‌లో ప్రత్యేక సెంటర్ ఏర్పాటు చేశారు. ఈ పథకానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించిన వెంటనే ఈ పథకానికి అర్హులైన వారికి వచ్చే నెల నుంచి జీరో బిల్లు వస్తుందని అధికారులు తెలిపారు.

వార్డు కార్యాలయంలో ప్రత్యేక కేంద్రం...

ప్రతి డివిజన్‌లో ఉన్న వార్డు కార్యాలయంలోనే కొన్ని రోజుల నుంచి ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి గృహజ్యోతి, గ్యాస్ సిలిండర్ వంటి పథకంలోని సమస్యలను పరిష్కరిస్తున్నారు. సంబంధిత అధికారికి మాత్రమే లాగ్ ఇన్ ఉంటుంది. ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటున్నారు. కానీ ప్రజలకు సమాచారం తెలియకపోవటంతో వార్డు కార్యాలయాలకు రాలేకపోతున్నారు. ముఖ్యంగా మూసాపేట డివిజన్‌లో రెండు వార్డు కార్యాలయాలు ఉండటంతో సెంటర్ ఎక్కడ ఉందో తెలియక, అసలు వార్డు కార్యాలయంలో ఈ ఏర్పాటు ఉందో లేదో అనే అయోమయ పరిస్థితిలో ప్రజలు ఉన్నారు.

◆ మూసాపేటలోని గాంధీ విగ్రహం వద్ద ఒక వార్డు కార్యాలయం, మోతీనగర్‌లో మరో కార్యాలయం ఉంది. మున్సిపల్ కార్యాలయానికి దగ్గరగా ఉందని మూసాపేటలోని వార్డు కార్యాలయాన్ని కాకుండా మోతీనగర్‌లోని వార్డు కార్యాలయాన్ని డివిజన్ కార్యాలయంగా అధికారులు మార్చారు. దీంతో ఈ పథకానికి సంబంధించిన సెంటర్‌ను మోతీనగర్‌లోని వార్డు కార్యాలయంలో ప్రారంభించి సమస్యలను పరిష్కరిస్తున్నారు.

◆ కానీ మూసాపేట ప్రాంతంలో ఉన్న పేద ప్రజలకు ఈ విషయం తెలియక మూసాపేటలోని వార్డు కార్యాలయానికి రోజూ వెళ్లి వకాబు చేసి తిరిగి వస్తున్నారు. స్థానిక ప్రజలు ఎక్కువగా అడుగుతుండటంతో శనివారం మధ్యాహ్నం నుంచి మూసాపేట వార్డు కార్యాలయంలో సెంటర్ ఏర్పాటు చేశారు. కానీ ప్రజలకు తెలియకపోవటంతో ఈ వార్డు కార్యాలయానికి వెళ్లలేకపోతున్నారు. అధికారులు ప్రచార మాధ్యమం ద్వారా ప్రజలకు తెలియచెప్పాల్సిన అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. అయితే డివిజన్‌కు ఒకటే లాగిన్ ఉండటంతో రెండు ప్రాంతాల్లో ఒకేసారి సెంటర్ ఏర్పాటు చేయటం వీలుకాదు. ఒకచోట ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు, మరోచోట మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఏర్పాటు చేస్తే వెసులుబాటు ఉంటుంది. అధికారులు ప్రజలకు సమాచారం అందించి ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

'హిందుత్వం' మతం కాదు

బీజేపీ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

రాయదుర్గం: హిందుత్వం అనేది ఒక మతం కాదని, దేశంలోని కొన్ని వర్గాలను కలిపే ఒక వారధి అని బీజేపీ చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. రాయదుర్గంలోని విష్పర్‌వ్యాలీలో ఆదివారం అల్పాహార సమావేశంలో ఆయన పాల్గొని స్థానికులతో మాట్లాడారు అనంతరం మాట్లాడుతూ.. హిందుత్వం కోసం ఒక్కొక్కరు ఒక్కొక్కటి చెప్తారని అవేమీ సరికావని, ఆర్‌ఎస్‌ఎస్, వీహెచ్‌పీ చెప్పేవే సరైనవన్నారు. రామమందిర నిర్మాణం కోట్లాది మంది భారతీయుల కల అని పేర్కొన్నారు. ఆ కలను ప్రధాని నరేంద్రమోదీ సాకారం చేశారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ మందిర నిర్మాణానికి దేశంలోని కోట్లాది మంది ప్రజలు తమ వంతుగా విరాళాలు అందించారన్నారు. ధనిక, పేద పట్టణం, గ్రామం అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఈ మహత్తర ఘట్టంలో పాలుపంచుకున్నారన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న భక్తులు ఆ శ్రీరామచంద్రుడి దర్శనం కోసం వెల్లువలా తరలి వెళ్తున్నారన్నారు. ప్రధాని ఈ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని కొనియాడారు. తెలంగాణ ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని, జాతీయ స్థాయిలో స్థిరమైన ప్రభుత్వం ఉంటే ధృఢమైన నిర్ణయాలు తీసుకుంటారనేందుకు బీజేపీ పరిపాలన నిదర్శనమన్నారు. రాష్ట్రంలో అత్యధిక లోక్‌సభ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. చేవెళ్లలో ప్రతి ఒక్కరూ బీజేపీకి ఓటువేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు.

వాల్ రైటింగ్స్, పోస్టర్ల తొలగింపు

శేరిలింగంపల్లి: సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ విడుదల కావడంతో రోడ్లపై ఉన్న రాజకీయ పార్టీలు ఏర్పాటు చేసిన వాల్ పోస్టర్స్, వాల్ రైటింగ్‌ను జీహెచ్‌ఎంసీ సిబ్బంది తొలగిస్తున్నారు. శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలో కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, భారతీనగర్ డివిజన్ల పరిధిలోని రోడ్లపై ఉన్న కటౌట్స్, వాల్ పోస్టర్స్, వాల్ రైటింగ్‌లను తొలగించే పనుల్లో శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు. శనివారం సాయంత్రం నుంచే వాటిని తొలగించే పనులు చేపట్టినట్లు శానిటరీ సూపర్‌వైజర్ జలంధర్‌రెడ్డి తెలిపారు. అధికారుల ఆదేశాల మేరకు సర్కిల్ పరిధిలోని 7 ప్రదేశాల్లో వాల్ రైటింగ్స్, 43 పోస్టర్స్, 11 ప్రదేశాల్లో ఫ్లెక్సీలు, బ్యానర్లు, 7 ప్రదేశాల్లో తోరణాలను తొలగించినట్లు వివరించారు. సోమవారం వరకు పూర్తికి తొలగిస్తామని ప్రకటించారు.

నిట్- పాట్నాకు విద్యార్థుల పర్యటన

రాయదుర్గం: యువ సంఘం ఫేజ్-4 కార్యక్రమంలో భాగంగా తెలంగాణ నుంచి బిహార్‌కు విద్యార్థులు ఆదివారం పయనమయ్యారు. మంగళవారం నుంచి ఈనెల 23 వరకు బిహార్‌లో విద్యార్థులు పర్యటించనున్నారు. బీహార్‌లోని నిట్-పాట్నా, హెచ్‌సీయూ ఈ కార్యక్రమానికి సమన్వయం చేస్తారు. ఈ యాత్రలో తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి 45 మంది విద్యార్థులు, హెచ్‌సీయూ నుంచి ఇద్దరు ఫ్యాకల్టీ ప్రతినిధులు డాక్టర్ వంశీ, డాక్టర్ నరేష్, ఇద్దరు సహాయక సిబ్బంది శ్రీశైలం, రాజేష్ పాల్గొంటున్నారు. ఆదివారం హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజే రావు జెండా ఊపి యాత్రను ప్రారంభించారు.

భూసమస్యలు పరిష్కరించాలి

పటాన్‌చెరుటౌన్: భూసమస్యలను పరిష్కరించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు వాజిద్ అలీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రామిక భవన్‌లో సీపీఎం పటాన్‌చెరు ఏరియా కమిటీ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాజిద్ అలీ మాట్లాడుతూ..పటాన్‌చెరు, అమీన్‌పూర్, జిన్నారం, గుమ్మడిదల, రామచంద్రాపురం మండలాల్లో వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. స్పెషల్ డ్రైవ్ పేరుతో భూ సమస్యలను పరిష్కరిస్తామని ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. దీంతో వెంటనే స్పందించి భూసమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. నాగేశ్వరరావు, అర్జున్, రామచంద్రమూర్తి, విశాల్ పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

పటాన్‌చెరుటౌన్: తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన నాగరిగారి ప్రీతంను ఎస్సీ డిపార్టుమెంట్ టీపీసీసీ రాష్ట్ర కన్వీనర్ దండోరా నర్సింహ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నర్సింహ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేవిధంగా కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సీ విభాగం నాయకులు బంగారిగాళ్ల శ్రీనివాస్, వెంకటేష్, బంగారిగాళ్ల రవి, తదితరులు పాల్గొన్నారు.

కాలానుగుణంగా మహిళల్లో చైతన్యం

హఫీజ్‌పేట్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా చందానగర్ డివిజన్ పరిధిలోని సరస్వతీ విద్యా మందిర్‌లో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎంవీఆర్ గ్రూపు సంయుక్తంగా వేడుకలను నిర్వహించారు. ఆదివారం జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హెచ్‌సీయూ ప్రొఫెసర్ దేవారెడ్డి విజయలక్ష్మి హాజరై మాట్లాడుతూ.. కాలానుగుణంగా మహిళల్లో చైతన్యం కనిపిస్తుందని, నేటి స్త్రీ తనను తాను నిర్మించుకుంటుందన్నారు. ఉద్యోగ రంగం, వ్యాపార, పారిశ్రామిక, రాజకీయ రంగంలోనూ తన శక్తి సామర్థ్యాలను నిర్భయంగా ప్రదర్శించుకుంటుందని పేర్కొన్నారు.

కారు చోరీ

రామచంద్రాపురం(పటాన్‌చెరు): కారు చోరీకి గురైన ఘటన రామచంద్రాపురంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రాపురం పట్టణంలో నివాసం ఉండే చిగురు శ్రీను పట్టణంలోని రాయసముద్రం చెరువులో రెండున్నరేళ్ల చేపల కాంట్రాక్టు తీసుకున్నాడు. రాత్రి సమయంలో చెరువులోని చేపలను ఎవరైన దొంగలిస్తారేమో అన్న అనుమానంతో ఆదివారం తెల్లవారుజామున తన కారులో రాయసముద్రం చెరువు కట్టపైకి వెళ్లి కారును ఆన్‌లో ఉంచి చెరువు పరిసరాలను పరిశీలిస్తున్న క్రమంలో గమనించిన ఓ గుర్తు తెలియని వ్యక్తి చిగురు శ్రీను కారుతో ఉడాయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆదిత్యకాలనీ సమస్యలను పరిష్కరిస్తా



ఆదిత్యనగర్‌లో పాదయాత్ర చేస్తున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని ఆదిత్యనగర్‌లో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై, చేపట్టవలసిన అభివృద్ధి పనులపై కాలనీవాసులతో కలిసి ఆదివారం కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆదిత్యనగర్ కాలనీ వాసులు, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను, సమస్యలను పరిగణనలోకి తీసుకొని వారి విజ్ఞప్తి మేరకు కాలనీలో పాదయాత్ర చేపట్టామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. సంతులిత, సమగ్ర అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు.

◆ అదేవిధంగా కాలనీవాసులు అందరూ కలిసి కాలనీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కాలనీ వాసులందరి సమష్టి కృషితో ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ఏ చిన్న సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తానని, ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని తెలిపారు. డివిజన్‌లో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు వెంకట్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, గోపి, అశోక్, శ్రీనివాస్, ప్రసాద్, రాజు, విజయ్, భాస్కర్‌రెడ్డి, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

'ప్రజాపాలనకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారు'

కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్



సర్దార్‌నగర్ నుంచి కాంగ్రెస్ పార్టీలో బండి రమేష్ సమక్షంలో చేరిన మైనార్టీ నాయకులు

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం బాలాజీనగర్‌లో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సాదు ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో కూకట్‌పల్లి నియోజకవర్గం ఇన్‌చార్జి బండి రమేష్ సమక్షంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజాపాలనకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న వారికి స్వాగతం పలుకున్నానని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. పార్టీలో ఉమా, ప్రమీల, గీతా, దివ్య, శ్వేత, పావని, ధనలక్ష్మీ, అనిత, సుధా, రాజశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, అర్జున్‌రెడ్డి, వినయ్, విక్కీ తదితరులు పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో బీ-బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, పుష్పరెడ్డి, శేరి సతీష్‌రెడ్డి, లక్ష్మయ్య, రేష్మ, నాగమణి, శివచౌదరి, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

భారీగా మైనార్టీ నాయకుల చేరిక

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సర్దార్‌నగర్‌లో వందమంది మైనార్టీ నాయకులు ఆదివారం కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. సర్దార్‌నగర్‌లోని మైనార్టీ నాయకులకు కూకట్‌పల్లి కాంగ్రెస్ తరపున స్వాగతం పలుకుతున్నానని అన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీ-బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, డివిజన్ అధ్యక్షుడు మొయినుద్దీన్, వర్కింగ్ ప్రెసిడెంట్ నరసింహ యాదవ్, విఠల్‌రెడ్డి, సీనియర్ నాయకుడు శేరి సతీష్‌రెడ్డి, బీ-బ్లాక్ అధ్యక్షురాలు రేష్మ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం



వెస్లీటీచర్స్ కాలనీలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ముద్దం మల్లికార్జునయాదవ్

ఓల్డ్‌బోయిన్‌పల్లి: డివిజన్‌లోని వెస్లీ టీచర్స్ కాలనీవాసుల కోరిక మేరకు కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ తన సొంత నిధులతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. ఆదివారం కాలనీవాసులు ఆహ్వానం మేరకు బీఆర్‌ఎస్ నేత ముద్దం మల్లికార్జునయాదవ్ కాలనీవాసులతో కలిసి సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మల్లేష్‌యాదవ్, వేంకటేశ్వర్‌రావు, ఎల్లన్న, రమేష్, నారాయణరావు, సాయన్న, చారి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడండి

మియాపూర్: సుప్రీంకోర్టు స్టేటస్ - కో ఉన్న భూముల్లో చేపడుతున్న నిర్మాణదారులపై చర్యలు తీసుకోవాలని జనంకోసం అధ్యక్షుడు కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి డిమాండ్ చేశారు. అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్న వాటిపై చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మియాపూర్‌లోని 100 సర్వేనంబర్‌లోని ప్రభుత్వ భూమి సుప్రీం కోర్టు గత 25 ఏళ్ల క్రితం స్టేటస్ - కో విధించింది. ఈ స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని నిబంధన ఉన్న కొంతమంది వ్యక్తులు నిబంధనలను భేఖాతర్ చేసి దానిని ఐదంతస్తుల నిర్మాణాలు చేపడుతున్నారు. దీనిపై స్థానిక అధికారులు పట్టించుకోవడంలేదని, ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నకిలీ ఓట్లను తొలగించాలని వినతి

పటాన్‌చెరు టౌన్: నియోజకవర్గంలో ఉన్న నకిలీ ఓట్లను తొలగించాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి దేవుజాకు ఆదివారం ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ నాయకులతో కలిసి తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో నాలుగు నెలల వ్యవధిలో వివిధ కారణాలతో 15 వేలకు పైె చిలుకు ఓట్లను తొలగించినట్లు తెలిపారు. కొందరు తమ ఉనికిని కాపాడుకోవడానికి బొల్లారం, పటాన్‌చెరు, పాశమైలారం పారిశ్రామిక వాడల్లో రెండు చోట్ల ఓటర్లుగా నమోదు చేయిస్తున్నారని ఆరోపించారు. వాటిని వెంటనే తొలగించి తాజాగా ఓటరు జాబితాను తయారు చేయాలని కోరారు.

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

అమలులో 5నిమిషాల నిబంధన

మూసాపేట: పదో తరగతి పరీక్షలకు కూకట్‌పల్లి, బాలానగర్ మండల పరిధిలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. కూకట్‌పల్లి, బాలానగర్ మండల పరిధిలో సుమారు 40 పరీక్ష సెంటర్లు ఉన్నాయని, సుమారు 9,954 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు ఎంఈఓ ఆంజనేయులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 1202 మంది పరీక్షలు రాయనుండగా.. ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు 8,752 మంది పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9.30 నుంచి 12.30 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు.

◆ మూసాపేట పరిసర ప్రాంతాల్లో 5 పరీక్ష కేంద్రాలు ఉన్నాయి. మూసాపేటలోని బాలికల ప్రభుత్వ పాఠశాల, కేర్‌ఉడ్ పాఠశాల, భరత్‌నగర్ కాలనీలోని స్ప్రింగ్ స్కూల్, సెయింట్ రీటా స్కూల్, స్వర్ణాంజలి స్కూలులో విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ట్రాఫిక్ దృష్ట్యా విద్యార్థులు సమయం కన్నా అరగంట ముందే పరీక్ష సెంటర్‌కు చేరుకోవాలని సూచించారు. 5 నిమిషాల తరువాత పరీక్ష హాల్‌కు అనుమతించమన్నారు. తల్లిదండ్రులు విద్యార్థులను ముందే కేంద్రానికి పంపాలని సూచించారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి ఎల్‌ఓసీ అందజేత



ఎల్‌ఓసీని అందజేస్తున్న జగదీశ్వర్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మబండ మరియమ్మనగర్‌కు చెందిన ఎస్.నర్సింహచారి అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం శేరిలింగంపల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్‌ను సంప్రదించారు. వెంటనే ఆయన నర్సింహచారితో ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేయించారు. ఈ మేరకు ఆదివారం మంజూరైన రూ.2.5లక్షల ఎల్‌ఓసీని లబ్ధిదారుడికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆల్విన్‌కాలనీ డివిజన్ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు, బాషిపాక యాదగిరి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

గుడ్ మార్నింగ్ వాకర్స్


మూసాపేట: భరత్‌నగర్‌కాలనీలో వాకర్స్ గ్రౌండ్‌లో గుడ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేసే ఆదివారం టిఫిన్ కార్యక్రమం 47వ రోజు సందర్భంగా టిఫిన్ ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ వేణును గుడ్‌మార్నింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. నాగిరెడ్డి, కూర విజయ్‌కుమార్‌లు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాణిక్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి, హనుమంతరావు, భిక్షపతి నేత, కర్క రవీందర్, పాండు ముదిరాజ్, సోమయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



భరత్‌నగర్‌కాలనీలో గుడ్ మార్నింగ్ కార్యక్రమంలో పాల్గొన్న వాకర్స్

'పేస్ యూరాలజీ కాన్‌క్లేవ్ - 2024'

మాదాపూర్: రోగులకు చికిత్స అందించడంలో అత్యున్నత నాణ్యత, సాంకేతిక పరిజ్ఞానంతో సేవలను పేస్ హస్పిటల్స్ అందిస్తున్నాయని ప్రముఖ యూరాలజిస్టు డాక్టర్ విశ్వంబర్‌నాథ్ తెలిపారు. మాదాపూర్‌లోని ఆవాస హోటల్‌లో పేస్ యూరాలజీ కాన్‌క్లేవ్-2024ను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. వైద్యరంగంలో ఎప్పటికప్పుడు అభివృద్ధి చెందుతున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం నేర్చుకోవాలన్నారు. అధునాతన సంక్లిష్టమైన మూత్ర పిండాల శస్త్రచికిత్స విధానాలు, రోబోటిక్స్, లాపరోస్కోపిక్ యూరాలజీ, కిడ్నీస్టోన్స్ కోసం మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ, కిడ్నీ చికిత్సలోని వివిధ సవాళ్లకు సంబంధించిన ఆయా రంగాల్లోని ప్రముఖ నిపుణులు వారి సూచనలు, సలహాలను అందించారు. ఎబీఓ, అనుకూలత, పీడియాట్రిక్ ట్రాన్స్‌ప్లాంటేషన్, రేడియోలాజికల్ ఇంటర్వెన్షన్‌లతో సహ మూత్ర పిండాల మార్పిడి శస్త్రచికిత్సలపై అవగాహన కల్పించారు. డాక్టర్ సుజాత, డాక్టర్ శ్యామ్‌వర్మ, డాక్టర్ సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ విశ్వంబర్‌నాథ్

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462
9705444132